ఆ ఆఫీస్‌కి శ్రీకాంత్ కొత్తగా ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాడు. అతను సరదాగా అందరితో కలివిడిగా ఉంటాడు. ఎదుటివారు కూడా తనతో అలాగే ఉండాలని కోరుకుంటాడు. అలా ఉండకపోతే శ్రీకాంత్‌కి నచ్చదు.

జాయినింగ్ రోజు కొలీగ్స్ అందరూ పరిచయం అయ్యారు, ఒకే ఒక యువతి తప్ప. శ్రీకాంత్ దూరం నుంచి ఆమెను చూసాడు. వయసు పాతిక సంవత్సరాలకు మించదు. అందంగానే వుంది. తల దించుకుని ఫైల్స్ చూస్తోంది. శ్రీకాంత్ ఆమె దగ్గరకు వెళ్లి "హలో మేడం! ఐయాం శ్రీకాంత్. ఈ రోజే జాయిన్ అయ్యాను. పరిచయం చేసుకుందామని వచ్చాను. మీ పేరు తెలుసుకోవచ్చా?" మర్యాద పూర్వకంగా అడిగాడు.

ఆ యువతి కళ్లెత్తి శ్రీకాంత్ వంక చూసింది. ఆమె మాత్రం శ్రీకాంత్ వంక ఒక్కక్షణం పరికించి చూసి "ఐయామ్ శృతి" అని తల దించుకుని పనిలో పడిపోయింది. శ్రీకాంత్‌కి ఆమెకి తనతో మాట్లాడడం ఇష్టం లేదని అర్థమైపోయింది. శ్రీకాంత్ వెనుదిరిగి వస్తుంటే నగేష్ అనే కొలీగ్ దగ్గరకు పిలిచి "శృతి కొంచెం రిజర్వుడు టైప్. ఆమె జోలికి వెళ్లకు" అని చెప్పాడు.

# మిస్డ్ కాల్




-ఎన్.శివనాగేశ్వరరావు

"ఐసీ" అన్నాడు శ్రీకాంత్ పైకి. లోపల మాత్రం 'అలా వెళ్లకపోతే నేను శ్రీకాంత్‌ను ఎందుకు అవుతాను?' అనుకున్నాడు.


'మొదటిరోజే పరిచయం అంటూ వచ్చేసాడు. ఆడపిల్ల కాస్త అందంగా ఉంటే చాలు మీద పడిపోతారు' అని మనసులో విసుక్కుంది శృతి.

***

వారంరోజుల్లో శ్రీకాంత్ అందరితో కలసిపోయాడు. అతను వేసే జోక్స్‌కి అందరూ పడీ పడీ నవ్వేవాళ్లు. ఎప్పుడూ ముభావంగా ఉండే బాస్‌ని కూడా శ్రీకాంత్ తన మాటలతో నవ్వించాడు.


'ఇలాంటివాడు ఆఫీసులో ఒక్కరుంటే చాలు అందరూ హుషారుగా ఉంటారు' అనుకున్నాడు బాస్. శ్రీకాంత్, శృతిని కూడా వదల్లేదు. ఆమె కనిపించినప్పుడు "గుడ్‌మార్నింగ్ శృతిగారూ" అని విష్ చేసేవాడు.

అతను విష్ చేసినా మాట్లాడకుండా తన సీట్లోకెళ్లి కూర్చుంది శృతి.



## పాపం హన్సిక!

హన్సికకి ఊహించని విధంగా తొలి సినిమాలు హిట్టయ్యేసరికి కాస్త క్రేజ్ ఏర్పడింది. అయితే అది కేవలం తన ఒక్కదాని వల్లే వచ్చిన సక్సెస్‌గా భావించి ఆమె తన పారితోషికాన్ని కోటి వరకూ డిమాండ్ చేస్తోందిట. ఈ పిల్లకి అంత సీనుందా అని ఆలోచిస్తున్న నిర్మాతలు 'అబ్బే...అక్కర్లేదమ్మా' అనుకుంటూ వెనక్కు వెళ్లిపోతున్నారుట. నిజంగానే హన్సికకి అంత డిమాండ్ వుంటే ఇంకా ఒకటీ రెండూ సినిమాలే ఎందుకు చేస్తోందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు సినీ జనాలు.




శ్రీకాంత్ కబుర్లు చెప్పడమే కాదు, పని కూడా బాగా వచ్చు. అందుకే తనకు అప్పగించిన పనిని చకచకా పూర్తి చేసుకుని అందరి సీట్ల దగ్గరకు వెళ్లి కబుర్లు చెప్పేవాడు. కొంతమందికి పనిలో సహాయం చేసేవాడు కూడా. నెల తిరిగేసరికి కొంతమంది కొలీగ్స్ అతన్ని ప్రత్యేకంగా తమ ఇళ్లకు ఆహ్వానించారు. శ్రీకాంత్ వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడు కూడా కొలీగ్స్ భార్యలను, తల్లిదండ్రులను తన మాటలతో మంత్రముగ్ధులను చేసేవాడు. ఒకసారి అతనితో పరిచయం అయినవాళ్లు మరలా మరలా అతని సాని హిత్యం కోరుకుంటారు. అందుకు కారణం అతని మాటలోని ప్రేమ, మనసులోని నిర్మలత్వం. మెల్లగా శ్రీకాంత్‌కు కొలీగ్స్ ద్వారా శృతి విషయాలు తెలిసాయి. ఆ అమ్మాయి భర్త అనురాగ్ అదే ఆఫీస్‌లో పని చేస్తూ ఏక్సిడెంట్‌లో మరణించాడు. అతని ఉద్యోగం శృతికి ఇచ్చారు.

శృతి వితంతువు అని తెలిసాక శ్రీకాంత్ ఎంతగానో బాధపడ్డాడు. ఆమె సీటు వద్దకు వెళ్లి "సారీ శృతిగారూ! మీ భర్త పోయారని తెలిసింది. ఐయాం ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ" అన్నాడు. "ఇట్స్ ఓకే" అంది శృతి. మనసులో మాత్రం భర్తలేని ఆడది అని తెలుసుకున్నాడు. ఇక విజృంభిస్తాడు అనుకుంది.

ఆమె అనుకున్నట్లుగానే అప్పటినుంచి శ్రీకాంత్ ఆమెపట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచడం మొదలుపెట్టాడు. క్యాంటిన్‌కు వెళ్లేటప్పుడు "వస్తారా?" అని నవ్వుతూ అడిగేవాడు. "నో థాంక్స్" అని చెప్పేది శృతి.

ఒకరోజు లంచ్ టైమ్‌లో శ్రీకాంత్, శృతి ప్రక్కన కూర్చున్నాడు.

లంచ్ బాక్స్ ఓపెన్ చేసి "మేడం! ఈ రోజు మా మిసెస్ లేదు. వంట నేనే స్వయంగా చేసాను. వంకాయ కూర రుచి చూడండి" అని కొంచెం కూర ప్లేటులో పెట్టి ఆమెకు అందించే ప్రయత్నం చేసాడు.

అయితే శృతి సీరియస్‌గా "నాకు పరాయివాళ్ల వంటకాలు తినే అలవాటులేదు" అని తన బాక్స్ ఓపెన్ చేసి తినసాగింది.

"పోనీ మీ వంట నేను రుచి చూడవచ్చా?" అని అడిగాడు శ్రీకాంత్.

'జిడ్డుగాడు... అంత తేలిగ్గా వదలడు' అనుకున్న శృతి కొంచెం కూర తీసి అతని ప్లేటులో వేసింది.

కూర రుచి చూసిన శ్రీకాంత్ "చాలా బాగుంది మేడం" అని కాంప్లిమెంట్ ఇచ్చాడు. 'ఆడపిల్లను పడగొట్టడానికి ఉపయోగించే చీప్ ట్రిక్స్ వీడి దగ్గర చాలా ఉన్నాయి' అనుకుంది శృతి.

***

నెల గడిచిపోయింది. తన ఆఫీస్‌లో పని చేసే లేడీస్ కూడా శ్రీకాంత్‌ని దగ్గరకు రప్పించుకుని మరీ మాట్లాడ్డం, 'ఒకసారి మా ఇంటికి రండి' అని ఆహ్వానించడం శృతి గమనించింది. 'వీడు పెద్ద కిలాడి. నెలరోజుల్లో అందరినీ మాయ చేసాడు. జాగ్రత్తగా ఉండాలి' అని మనసులో అనుకుంది.

మధ్యలో శ్రీకాంత్ రెండురోజులు సెలవు పెట్టాడు. అందరూ అతని కోసం కలవరించిపోయారు. 'శ్రీకాంత్ లేకపోతే పరమబోర్‌గా ఉంది' అని లేడీ కొలీగ్స్ కూడా అనుకోవడం శృతి వింది.

'ఏమున్నది వీడి దగ్గర? అందరూ పడి చస్తున్నారు?' అనుకుంది.

రెండురోజుల తరువాత శ్రీకాంత్ వచ్చాడు. అందరూ 'హాయ్ శ్రీకాంత్! ఎక్కడికెళ్లావు? మేమెంత బోర్‌గా ఫీలయ్యామో తెలుసా?' అంటూ గొడవ చేసారు. శ్రీకాంత్ అందరినీ పలకరించాడు. 'సారీ... అనుకోకుండా మంత్రాలయం వెళ్లాను' అని చెప్పి అందరికీ ప్రసాదం అందించాడు.

శృతి దగ్గరకు వచ్చి ఆమెకు ప్రసాదంతోపాటు రాఘవేంద్రస్వామి ఫోటో అందించి 'ప్లీజ్ కాదనకుండా తీసుకోండి. స్వామీ మీ మనసుకు శాంతిని ప్రసాదిస్తాడు' అని చెప్పాడు. శృతికి ఆ ఫోటో శ్రీకాంత్ దగ్గర నుంచి తీసుకోవడం ఇష్టంలేదు. దేవుడి పటం వద్దని చెప్పడానికి మనస్కరించలేదు.

శ్రీకాంత్ ఆ ఆఫీస్‌కు వచ్చి మూడునెలలు అయింది. ఎవరికి ఏ సలహా కావాల్సివచ్చినా శ్రీకాంత్‌నే అడుగుతారు. తమ బాధలు అతనితో చెప్పుకుంటారు. ఆఖరికి బాస్‌ని కలవడానికి భయపడేవాళ్లు తమ విషయం కాస్త బాస్‌కి చెప్పమని కోరేవారు. ఒకరోజు శ్రీకాంత్ శృతిని కలసి "మీ ఫోన్ నెంబర్ ఇస్తారా?'' అని అడిగాడు.

"ఎందుకు?'' సీరియస్‌గా అడిగింది శృతి.

"కొలీగ్స్ అందరి నెంబర్లు దగ్గర ఉంచుకోవడం నాకలవాటు. అందుకే అడిగాను'' చెప్పాడు శ్రీకాంత్.

"నా నెంబర్ పరాయివాళ్లకు ఇచ్చే అలవాటు నాకులేదు'' స్పష్టంగా చెప్పింది.

***

"శృతిగారూ ఒకసారి మా ఇంటికి రండి. నా భార్యను పరిచయం చేస్తాను. మా పాపనూ చూసినట్లు వుంటుంది''

"అందరినీ పిలిచారా?''

"ఆల్‌రెడీ కొందరు వచ్చారు. ఇప్పుడు మిమ్మల్ని పిలుస్తున్నాను''

"ఏదైనా ఫంక్షన్ ఉన్నప్పుడు పిలవండి. అందరితోపాటు వస్తాను. ఇప్పుడు మాత్రం ఒంటరిగా రాను'' అంది శృతి.

'శ్రీమతిని పరిచయం చేస్తాను అని పిలుస్తాడు. వెళ్లేసరికి ఆమె ఉండదు. ఇప్పుడే బయటకువెళ్లింది. ఈలోపు మనం మాట్లాడుకుందాం అని నానా చెత్త మాట్లాడతాడు. ఎంతమంది మగాళ్లను చూడలేదు?' అనుకుంది శృతి.

ఒకరోజు శ్రీకాంత్ శృతి వద్దకు వచ్చి "మీతో పర్సనల్‌గా మాట్లాడాలి'' అన్నాడు. 'ఇక డైరెక్ట్ అయిపోతున్నాడు. వీడు నాతో మాట్లాడేది ఏముంటుంది? ఐ లవ్ యూ చెప్పడమో, లేకపోతే గదికి రమ్మనడమో చేస్తాడు' అనుకుంది. అతని నోటి నుంచి అటువంటి మాటలు వస్తే పదిమందినీ పిలిచి గట్టిగా క్లాసు తీసుకోవాలని మనసులో నిర్ణయించుకుంది.

అందుకే పెదవులపై లేని చిరునవ్వును తెచ్చుకుని "చెప్పండి'' అంది.

"నా ఫ్రెండ్ ఒకడున్నాడు. పేరు శంకర్. ఇంజనీరింగ్ చేసి ఇప్పుడు విప్రోలో పని చేస్తున్నాడు. అతనికి మీ గురించి చెప్పాను. ఒకసారి మిమ్మల్ని కలవాలన్నాడు. మీ అభిరుచులు కలిస్తే, మీరు ఒకరినొకరు ఇష్ట పడితే అతను మిమ్మల్ని పెళ్లి చేసుకుంటానన్నాడు. మీకు నచ్చితేనే'' చెప్పాడు శ్రీకాంత్. శృతి తలెత్తి శ్రీకాంత్ కళ్లల్లోకి చూసింది.

"తొందరేంలేదు. నెమ్మదిగా ఆలోచించుకోండి. మీరు మళ్లీ పెళ్లి చేసుకుంటే బావుంటుంది. ఒక ఫ్రెండ్‌గా సజెస్ట్ చేస్తున్నాను'' అన్నాడు శ్రీకాంత్.

ఆమె అవునని అనలేదు, కాదని అనలేదు. 'ఆలోచిస్తాను' అని అంది.

***

ఆ రాత్రి శ్రీకాంత్ ఇంటి దగ్గర ఉండగా ఒక మిస్‌డ్ కాల్ వచ్చింది. ఆ నెంబర్ అతనికి కొత్తగా అనిపించింది. డయల్ చేసాడు. ఫోన్ రింగయింది. ఎవరో లిఫ్ట్ చేసారు. అయితే వెంటనే మాట్లాడలేదు. 'హలో... మీ నెంబర్ నుంచి మిస్‌డ్‌కాల్ వచ్చింది. మీరెవరో తెలుసుకోవచ్చా?'' అడిగాడు శ్రీకాంత్. ఒక్క క్షణం నిశ్శబ్దం. ఆ తరువాత "నేను శృతిని''

"హలో... మీరా? ఎందుకు మిస్‌డ్‌కాల్ ఇచ్చారు?'' అడిగాడు శ్రీకాంత్.

"ఒకసారి మీరు నా ఫోన్ నెంబర్ అడిగారు. అప్పుడు ఇవ్వలేదు. ఇప్పుడు నెంబర్ చెప్పడానికి ధైర్యం చాలక మిస్‌డ్ కాల్ ఇచ్చాను. మావారు పోయాక జీవితంలో చాలామంది మగవాళ్లు తారసపడ్డారు. మగతోడులేని ఆడమనిషిని ఈజీగా టాకిల్ చేయవచ్చునన్న ధోరణిలో ఉండేవారు. అందుకే నా చుట్టూ గిరి గీసుకున్నాను. మీరూ అలాంటి వాళ్లేనని భావించి మీతో కఠినంగా మాట్లాడాను. ఐయాం సారీ'' అంది శృతి.

"మనకు ఒకసారి రాంగ్‌కాల్ వచ్చినప్పుడు ఆ తరువాత రైట్ కాల్ వచ్చినా అది రాంగ్ కాల్ ఏమోనని సందేహించడం సహజం. మీరు నన్ను సందేహించినందుకు నేనేం బాధపడడంలేదు. కానీ మీరు ఒక మిస్‌డ్ కాల్‌గా మిగిలిపోవడం నాకిష్టంలేదు. అందుకే మిమ్మల్ని అందరితో కనెక్ట్ చేయడానికి ప్రయత్నించాను. అంతకుమించి నేను చేసింది ఏమీలేదు''

"థాంక్యూ వెరీమచ్. మీ స్నేహితుడు శంకర్‌గారిని కలసి మాట్లాడతాను. అలాగే మీలాంటి మంచి ఫ్రెండ్ దొరికినందుకు మనస్ఫూర్తిగా ఆనందం వ్యక్తం చేస్తున్నాను'' అంది శృతి.

"థాంక్యూ... అండ్ ఆల్ ది బెస్ట్'' అన్నాడు శ్రీకాంత్.ఫోన్ కట్ అయింది.

చాలాకాలం తరువాత శృతి తన ఫోన్ బుక్‌లో ఒక కొత్త నెంబర్ కలుపుకుంది.

★



## స్నేహమేరా జీవితం

బ్యాంకాక్‌లో ఒక దంపతులు కుక్కని, చిలుకని పెంచుకుంటున్నారు. వాళ్లోరోజున లోకశాంతికోసం జరుగుతున్న ప్రార్థనల్లో పాల్గొంటుండగా స్నేహమేరా జీవితమంటూ నాల్గునెలల చిలుకను తన నెత్తికెక్కించుకుని ముద్దు చేసిందా కుక్క!

-తటవర్తి

